# కదలని కదలిక



*గోదా విషమావతార*
*చ్ఛలేన ఆత్మా అస్య ఉరసి ముక్తః*
*అనుకంపానిర్దోషం*
*తేనాపి సాగాఢ ముపగూఢా*

***భావం:*** గోదావరి నదిని దాటడం కష్టంగా ఉందన్న మిషతో ఆమె అతని వక్షస్థలం మీదకు వాలింది. దయా గుణంలో దోషం లేదన్న ఉద్దేశంతో అతనామెను అతి దగ్గరగా తీసుకున్నాడు.

భారతీయ సంప్రదాయంలో వివాహాలు ఆడంబరంగా చేస్తారు. ఇరువైపుల బంధుమిత్రులనీ ఆహ్వానించి పాంచరాత్ర వివాహం చెయ్యడం ఆనవాయితీ. ప్రేమ వివాహాలకన్నా పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే ఎక్కువ కాబట్టి ఎవరింట్లో పెళ్లికైనా వెడితే సంబంధాల గురించిన వివరాలు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

అలా జరిగిన ఒక వివాహంలో ఒకమ్మాయికీ, ఒక అబ్బాయికీ ఆకర్షణ ఏర్పడింది. పెళ్లి పనుల్లో చలాకీగా తిరుగుతూ, నలుగురితో సరదాగా మాట్లాడుతూ, అందరినీ ఆకట్టుకుంటున్న అమ్మాయిని చూడగానే అతనిలో ప్రేమ తరంగాలు పొంగి ప్రవహించాయి. అమ్మాయి సన్నగా, పొడుగ్గా, తెల్లగా, అందంగా ఉంది. వివాహానికి వెయ్యి మంది దాకా వచ్చారు. ఆమె ఎవరో తెలుసుకునే ప్రయత్నం సఫలం కాలేదు.

ఆ అమ్మాయి కూడా అతన్ని చూడగానే ఆకర్షితురాలైంది. బలిష్ఠాలైన భుజాలూ, తుమ్మెద రెక్కల్లాంటి మీసమూ, విశాలమైన వక్షస్థలమూ, గజగమనమూ చూసి కళ్లు తిప్పు కోలేక పోయింది. అతని గంభీరమైనదీ, మృదుమధురమైనదీ అయిన వాక్కు ఆమెను కదలనీయలేదు. అతనెవరో తెలుసుకుందుకు సిగ్గు అడ్డం వచ్చింది.

వివాహ కార్యక్రమం పూర్తయింది. పెళ్లి వారందరూ తిరుగు ప్రయాణమయ్యారు. కొంత సేపటికి గోదావరి అడ్డం వచ్చింది. వేసవి కాలం నీళ్లు లోతు లేవు. పడవలు నడవవు. అందరూ మెల్లిగా నదిలో లోతు చూసుకుంటూ, బురదలో జారకుండా నడుస్తున్నారు. అమ్మాయి ఆలోచించింది. సిగ్గుని వెనకపెట్టి సాహసం చెయ్యాలనుకుంది. నది దాటడం కష్టంగా ఉందన్న మిషతో అతనికి దగ్గరగా వెళ్లి అతని వక్షస్థలం మీదకు వాలింది. అబ్బాయి ఆలోచించాడు. దయాగుణంలో ఏ దోషమూ లేదు. ఒక అబల తన సహాయం అర్థించింది. ఆమెను రక్షించాలి. ఆమె పడిపోకుండా కాపాడడానికా అన్నట్లు అతనామెను రెండు చేతులతో దగ్గరగా తీసుకున్నాడు.

పెళ్లివారందరూ గోదావరిని త్వరగా దాటుతున్నారు. ఆ యువతీ యువకుల కాళ్లు కదలడం లేదు. అతనిపై వాలి ఆమే, ఆమెను దగ్గరగా తీసుకుని అతనూ నెమ్మదిగా నడుస్తున్నారు.

రేవు దాటిన పెద్దలు వెనక్కి తిరిగి చూశారు. పిల్లల అవస్థకు వారి పెదవులపై చిరునవ్వు కదలాడింది. అక్కడకక్కడే సంబంధం నిశ్చయమైంది. ఏదో ఒక మిషతో దగ్గరగా ఉండే కష్టం ఆ యువతీ యువకులకు తప్పింది. పిల్లల మౌనరాగాన్ని పెద్దలు అర్థంచేసుకుంటే అందరికీ ఆనందమే కదా.

******